## క్లుప్తంగా

### ఎమ్మెల్యే పల్లా పరామర్శ



మృతుని కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**కొమురవెల్లి(సిద్దిపేట):** ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన గౌరయపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పెద్ది మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. మృతుడి తల్లిదండ్రులకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### పంట నమోదు తప్పనిసరి



పంట వివరాలు నమోదు చేస్తున్న ఏఓ పూజ

**హుస్నాబాద్‌రూరల్:** రైతులంతా తమ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ పూజ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె గాంధీనగర్‌లో పంటలను పరిశీలించి డిజిటల్ యాప్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట విక్రయించాలంటే రైతుల పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావాలని చెప్పారు. మార్కెట్‌కు ధాన్యం తెచ్చాక పంట నమోదు చేయాలంటే సాధ్యపడదని, కపాస్ కిసాన్ యాప్‌లో స్వీయ నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే విక్రయానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామాలకు వచ్చే ఏఈఓల వద్ద పంట వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆమె వెంట ఏఈఓ సంగీత తదితరులు ఉన్నారు.

### గుర్తింపు నిచ్చేది సేవలే..



వైకుంఠాన్ని సన్మానిస్తున్న మహేశ్ తదితరులు

**మిరుదొడ్డి(దుబ్బాక):** వృత్తి రీత్యా చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని ఐకేపీ సీసీఏల జిల్లా ఉపాధ్యక్షుడు కిచ్చని మహేశ్ అన్నారు. స్థానిక ఐకేపీలో సీసీగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన వైకుంఠాన్ని సోమవారం మహిళా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తేనే ప్రతి ఒక్కరిలో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఐకేపీ వీఓఏ లీడర్లు సుమలత, లక్ష్మి, ప్రియాంక, వెంకట్‌లక్ష్మి, సూర్యమణి, విజయ తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన



గుర్జకుంటలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

**చేర్యాల(సిద్దిపేట):** మండలంలోని గుర్జకుంటలో సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందం సభ్యులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కళాకారులు పిన్నింటి రత్నం, పిల్లిట్ల శ్యాంసుందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈగలు, దోమలు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లి, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కనకయ్య, హరిప్రసాద్, శ్రీనివాస్, భిక్షపతి, సిద్ధులు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాదరణ పొందిన నేత కర్ర శ్రీహరి



నివాళులర్పిస్తున్న నాయకులు

**హుస్నాబాద్:** దివంగత బీఆర్‌ఎస్ నేత కర్ర శ్రీహరి సంతాప సభ అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన ఆత్మీయులు సోమవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కర్ర శ్రీహరి దాదాపు 40 సంవత్సరాల సుదీర్ఘ నేతగా ప్రజల ఆదరణ పొందారన్నారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజలకు ఎన్నో సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, వెంకట్, చంద్రయ్య, బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి, రవీందర్, రాజిరెడ్డి, శంకర్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ, కొమురయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మండపంలో కొలువైన దుర్గమ్మ తల్లి



నంగునూరులోని మండపంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం



గజ్వేల్‌లోని 108 చీరలతో కుమారీదేవి అలంకరణలో మహంకాళి అమ్మవారు

## జయ జయహే.. జగన్మాత

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అన్ని గ్రామాల్లో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి వేడుకల్లో భాగంగా మొదటి రోజున అమ్మవారు బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవి ఆలయాలు, మండపాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయాలు, మండపాలు దేవి నామస్మరణతో మార్మోగాయి.



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరులో పూజలు చేస్తున్న భక్తులు



చేర్యాల(సిద్దిపేట): ఆకునూరు భవాని రుద్రేశ్వరాలయంలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): పెద్దకోడూరు మండపంలో..

## సరస్వతీ మాతకు నగల ధగధగ



దాత అందజేసిన ఆభరణాలతో ఆలయ పరివారం

**వర్గల్(గజ్వేల్):** వర్గల్ శ్రీవిద్యా సరస్వతీదేవి బంగారు తాపడం నగలు, కవచాలతో ధగధగలాడనున్నది. సోమవారం ఓ అజ్ఞాతభక్తుడు వెండితో కవచాలు, ఆభరణాలను తయారుచేయించి, బంగారు తాపడం చేయించి ఆలయంలో అందజేశారు. ఆయా ఆభరణాలకు శ్రీమధుసూదనానంద సరస్వతి ప్రత్యేక పూజలు జరిపి, అమ్మవారికి సమర్పించారు.

## కొనసాగుతున్న పోషణ మాసోత్సవాలు

**మిరుదొడ్డి(దుబ్బాక):** మండల పరిధిలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా సోమవారం పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన వాతావరణం వంటి అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కలిగించారు. అంగన్‌వాడీ చిన్నారులకు ఆటపాటలు, కథలు, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానంపై కార్యక్రమాలు నిర్వహించారు. దుబ్బాక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక పర్యవేక్షించి సలహాలు, సూచనలిచ్చారు. ఆయా కార్యక్రమాలల్లో అంగన్‌వాడీ టీచర్లు పున్నమ్మ, ప్రేమలత, బుజ్జమ్మ, రేణమ్మ, రేణుక, హెల్పర్లు గౌసియా తదితరులు పాల్గొన్నారు.

**తిర్మలాపూర్‌లో..**

**దౌల్తాబాద్(దుబ్బాక):** మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఎలాంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కలిగించారు. పౌష్టికాహాలరం తీసుకుంటేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీసీ భాస్కర్, టీచర్లు అనిత, కల్యాణి, వినోద తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో చిన్నారులకు కథలు చెబుతున్న అంగన్‌వాడీ టీచర్

## ఊర చెరువును పరిశీలించిన అధికారులు

**గజ్వేల్:** మున్సిపాలిటీ పరిధిలోని ఊర చెరువు వరద ప్రభావం తీరును సోమవారం ఇరిగేషన్‌శాఖ అధికారులు పరిశీలించారు. ఆ శాఖ ఈఈ శ్రీనివాస్, డీఈ మోతియా, జేఈఈ శ్రీకాంత్‌లు చెరువుతోపాటు మత్తడి దూకే ప్రదేశాన్ని సందర్శించారు. ప్రధాన రహదారిపై ఊర చెరువు వరద నీరు రావడానికి గల కారణాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు వారు తెలిపారు.



ఊర చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

## ప్రజల గుండెల్లో సుస్థిరంగా 'గులాబీ'



హరీశ్‌రావు సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

**ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**సిద్దిపేటజోన్:** తెలంగాణ ప్రజల గుండెల్లో గులాబీ జెండా ఎప్పుడూ సుస్థిరంగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో నంగనూర్ మండలం నాగరాజుపల్లి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో ప్రభాకర్, ఇమాం, హమీద్, జక్కిరెడ్డి, జీవన్ తదితరులున్నారు.

## పేదలకు అండగా సీఎం సహాయనిధి

**దౌల్తాబాద్(దుబ్బాక):** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు మంజూరైన చెక్కులకు సోమవారం ఆయన మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద అందజేశారు. నాయకులు స్వామి, లాలు, మల్లారెడ్డి, లలిత కృష్ణ, ప్రవీణ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

**వీరన్నపేటలో..**

**చేర్యాల(సిద్దిపేట):** మండల పరిధిలోని వీరన్నపేటకు చెందిన చిగుళ్ల చిన్న అయ్యాలంకు మంజూరైన రూ.50 వేల సహాయనిధి చెక్కును మాజీ సర్పంచ్ కొండపాక భిక్షపతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యం కోసం సీఎం సహాయనిధి ఎంతో దోహద పడుతుందన్నారు.

**కొల్గూరులో..**

**గజ్వేల్‌రూరల్:** మండల పరిధిలోని కొల్గూరులో గ్రామస్తులు మధుకర్‌రెడ్డి, బాల్‌నర్సయ్య, జయశ్రీ, సుకన్యకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి సోమవారం అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆంజనేయులు, యాదగిరిగౌడ్, గణేశ్, నర్సయ్య, శ్రీనివాస్, రాములు, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్‌లో చెక్కులు అందిస్తున్న నాయకులు

## లంబాడీల గొంతు నొక్కలేరు

**గిరిజన సంఘాల నేతలు**

**అక్కన్నపేట(హుస్నాబాద్):** అక్రమ అరెస్టుల ద్వారా లంబాడీల గొంతు నొక్కలేరని గిరిజన సంఘాల నేతలు నూనావత్ మోహన్‌నాయక్, భూక్య కృష్ణనాయక్ అన్నారు. 'ఛలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ముట్టడి' కార్యక్రమానికి వెళ్లనీయకుండా గిరిజన నాయకులను అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించడం తగదన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలనే కుట్రలు, కుతంత్రాలు, అసత్య ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సోయం బాబురావులను పార్టీ నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు లావుడ్యా రైనా నాయక్ పాల్గొన్నారు.

### స్నేహితుల సాయం

**కొండపాక(గజ్వేల్):** మండలంలోని దుద్దెడలో బాల్య స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థులు అండగా నిలిచారు. ఇటీవల వారి స్నేహితుడు జగన్ మృతి చెందడంతో మృతుడి ఇద్దరి కుమార్తెలకు ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను సోమవారం అందజేశారు. అలాగే క్వింటాల్ బియ్యం ఇచ్చి ఆదుకున్నారు. మిత్రులు చిన్న శ్రీనివాస్, పంజాల రమేశ్, బూర్గుల వెంకటరమణ, సల్మాన్, వీరేశం, శ్రీనివాస్, బాలరాజు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం విఫలం

**మిరుదొడ్డి(దుబ్బాక):** పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ మండల కార్యదర్శి మద్దెల అంజయ్య విమర్శించారు. మిరుదొడ్డిలో సోమవారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఆయా పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రామ పారిశుధ్య కార్మికులకు నాలుగైదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో నానాఅవస్థ పడుతున్నారన్నారు. బతుకమ్మ, దసరా పండుగకు వేతనాలు చెల్లించకపోడంతో కార్మికులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. పంచాయతీ సిబ్బందికి దసరా పండుగ సందర్భంగా రెండు జతల యూనిఫారాలు అంజేయాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పరశురాములు, మల్లేశం, నవీన్ పాల్గొన్నారు.

## పంచాయతీ ఎదుట గ్రామస్తుల నిరసన

**అక్కన్నపేట(హుస్నాబాద్):** పంచాయతీ కార్యదర్శి గ్రామానికి రావడంలేదని, ఎంగిలిపూల బతుకమ్మ పండుగకు ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో మహిళలు చికటిలో జరుపుకొన్నారని మండలం పరిధిలోని రేగొండ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పలు కాలనీల్లో డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదన్నారు. గ్రామ కార్యదర్శి ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొందని, నెలల వ్యవధిలోనే ఇద్దరు, ముగ్గురు కార్యదర్శులు మారారని వాపోయారు. మండల అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కార్యదర్శులు గ్రామాలకు సక్రమంగా రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఉపాధి హామీ గ్రామసభను బహిష్కరిస్తున్నామని చెప్పారు. దీంతో అధికారులు గ్రామసభను వాయిదా వేశారు.



నిరసన తెలుపుతున్న రేగొండ గ్రామస్తులు

## యూరియాను మోతాదు మించి వాడొద్దు

**జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి**

**కొండపాక(గజ్వేల్):** యూరియాను అధికంగా వాడటం వల్ల భూమి నిస్సారంగా మారుతుందని జిల్లా వ్యవసాయాధికారి స్వరూపరాణి అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సోమవారం తనిఖీ చేశారు. యూరియా పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంటలకు సరిపడా యూరియాను ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలానికి గతేడాది కంటే 200 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. మోతాదుకు మించి వినియోగించడంతో కొరత ఏర్పడుతుందని చెప్పారు. రైతులు నానో యూరియా వాడి అధిక దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ, సీఈఓ రాజు, రైతులు పాల్గొన్నారు.



యూరియా పంపిణీ పరిశీలిస్తున్న స్వరూపరాణి

## పిడుగుపడి ఆవు మృతి

**చిన్నకోడూరు(సిద్దిపేట):** పిడుగు పడి పాడిఆవు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గంగాపూర్లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు పీరెల్లి ఐలయ్య రోజులాగానే తన పొలం వద్ద ఆవును కట్టేశాడు. సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షంతోపాటు పిడుగుపడటంతో ఆ ఆవు మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని విలపించాడు.

## 12 పాఠశాలల్లో బాత్‌రూంలు కరువు

**ఎంఈఓ రంగనాయక్**

**అక్కన్నపేట(హుస్నాబాద్):** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై అధికారులు సర్వే చేపట్టారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎంఈఓ గుగులోతు రంగనాయక్ సోమవారం పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కట్కూర్, చౌటకుంట, ధర్మారం, గౌరవెల్లి, కేశవాపూర్, కుందనవానిపల్లి, మల్లంపల్లి, రాజుతండా, అక్కన్నపేట గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయన్నారు. ఈ గ్రామాల్లోని పాఠశాలలు మన ఊరు- మన బడి కింద మంజూరుగా కాగా సదరు కాంట్రాక్టర్లు మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయలేదని చెప్పారు. కొన్ని పాఠశాలల్లో నిర్మించినా విద్యుత్ సరఫరా, తలుపులు బిగించకుండా మధ్యలోనే వదిలేశారని, పాఠశాలల్లోని వసతులు, మరుగుదొడ్ల సౌకర్యాలపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు లక్ష్మణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



గౌరవెల్లి పాఠశాలలో హెచ్‌ఎం మల్లేశం పరిశీలన

## పశువైద్య కేంద్రం.. కూలడానికి సిద్ధం

- శిథిలావస్థకు చేరిన భవనం
- ఒక్కగదిలోనే విధులు
- అందని నీటి సరఫరా
- బాత్‌రూంలోనే మందుల నిల్వ



శిథిలావస్థకు చేరిన పశువైద్య కేంద్ర భవనం

**అక్కన్నపేట(హుస్నాబాద్):** మండలంలోని మల్లంపల్లి గ్రామంలోని ప్రాథమిక పశువైద్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలిపోతుందో తెలియక అధికారులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ పశువైద్య కేంద్రం పరిధిలో మల్లంపల్లి, కట్కూర్, చౌటపల్లి, కేశవాపూర్ గ్రామాలు ఉన్నాయి. కాగా పశువులకు సంబంధించిన మందులు, వ్యాక్సిన్ తదితర వస్తువులు ఉంచేందుకు గదులేక ఉన్న ఒక్క గదిలోనే బాత్‌రూంలో నిల్వచేస్తున్నారు. వైద్యాధికారితోపాటు అసిస్టెంట్, అంటెండర్‌లు కూడా ఒకేగదిలో విధులు నిర్వహిస్తున్నారు. శ్లాబ్, గోడల నుంచి పెచ్చులూడి పడుతున్నాయని ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొందని వారు వాపోతున్నారు.

**తాగునీరు కూడా కరువు**

ఈ పశువైద్య కేంద్రంలో నీటి సరఫరా లేకపోవడంతో అధికారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు వ్యాక్సిన్ ఇచ్చిన తర్వాత చేతులు శుభ్రం చేసుకునేందుకు సైతం నీరు లేదు. ఇక తాగేందుకు సరేసరి. అలాగే ఒకటి, రెండుకు వస్తే పడరాని పాట్లు పడుతున్నారు. ఇకనైనా నూతన భవనం మంజూరు చేసి తాగునీటి సరఫరాకు పైపులైన్ కలెక్షన్ ఇవ్వాలని రైతులు, అధికారులు కోరుతున్నారు.

## ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ఏబీవీపీ నాయకులు**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** దసరా సెలవుల్లో కూడా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు తరగతులు నిర్వహిస్తున్నాయని, ఆ విద్యా సంస్థల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ సిద్దిపేట నగర కార్యదర్శి గుగులోత్ పరశురాం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సరైన విశ్రాంతి లేకపోవడంతో విద్యార్థులు నిరాశకు గురవుతున్నారని వాపోయారు. విద్యాశాఖ అధికారులు హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించాలని సూచించారు. అనీష్, శుభం శర్మ, రాకేశ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.